# నిజం దాగదు

తండ్రి కోపంగా అతనివైపు చూశాడు.

గోపాల్ గజగజ వణుకుతున్నాడు

"ఇన్నాళ్ళూ చదవకుండా రోడ్లమ్మట తిరిగావు! నీ ముఖానికి చదవు రాదురా!" అరిచాడు తండ్రి.

గోపాల్ మాట్లాడలేదు. అతని వయస్సు పదిహేను సంవత్సరాలుంటుంది. ఎసెసెల్సీ చదువుతున్నాడు. రెండు నెల్లో అతను పరీక్షలకు హాజరై రాయాలి!

"నీ లెక్కల బుక్కు పట్రా," అన్నాడు తండ్రి.

కొడుకు వెనక్కి తిరిగాడు. గోడ వారగా వున్న పాత ట్రంకుపెట్టెను తెరిచి పుస్తకంకోసం వెతకసాగాడు. రాజారావు సిగరెట్ వెలిగించి, పొగ వూదుతూ కొడుకువంక చూస్తున్నాడు. ఈనాటి కుర్రాళ్ళకు చదువుమీద ఆసక్తి లేదు. ఎప్పుడూ సినిమాలూ, పత్రికలూ, నవలలూ చూస్తూ కాలాన్ని గడిపేస్తారు!

జంకుతూ గోపాల్ ఒక పుస్తకాన్ని తండ్రిచేతిలో పెట్టాడు.

"ఇది నోట్‌బుక్! నే నడిగింది టెక్ట్స్ బుక్కురా!" గర్జించాడతను.

"అది నా ఫ్రెండు కిచ్చాను "

"ఎందుకిచ్చావు? ఎవర్నడిగిచ్చావు? పరీక్షలు దగ్గర అవుతున్నాయని తెలిసి కూడా ఫ్రెండ్ కిచ్చావా?"

"రేపు తెచ్చుకుంటాను, నాన్నా," అన్నాడు గోపాల్.

"తెస్తావు రేపు వెధవాయి!" అని వాడి చెవి పట్టుకుని గట్టిగా పిండి, చేతిలో వున్న నోట్‌బుక్‌ను వాడిమీదకు విసిరాడు.

క్రింద పడిన నోట్‌బుక్‌ను గోపాల్ వినయంగా వంగి తీసుకున్నాడు ఎర్రబడిన చెవిని రాసుకుంటూ తండ్రికేసి చూశాడు.

"ఇంకెప్పుడూ యివ్వను," అన్నాడతను.

"మరే బుక్కులేనా ఫ్రెండ్స్‌కు యిచ్చావా?"

"సైన్సు బుక్కు కూడా యిచ్చాను. ఆ రెండే!"

"తతిమ్మా బుక్కులన్నీ నీ పెట్లో వున్నాయా?"

"వున్నాయి, నాన్నా," అన్నాడు గోపాల్.

"నిన్ను నమ్మకూడదు! పెట్టె తెరిచి చూస్తే నిజం తెలుస్తుంది," అని రాజారావు

టెంపోరావ్

కుర్చీలోంచి లేచాడు. మోకాళ్ళ మీద కూర్చుని అతడు ట్రంకుపెట్టెను తెరిచాడు గోపాల్ పక్కనే మౌనంగా నుంచున్నాడు. అట్టడుగునున్న ఏదో పుస్తకాన్ని అతడు బయటకు లాగాడు దానిమీదున్న పేరుచూసి అతను త్రుళ్ళి పడ్డాడు.

కొక్కోకము!

కొడుక్కి కనపడకుండా పుస్తకం పేజీలను తిప్పి చూశాడు. వివిధ రకాల భంగిమలు! బూతు బొమ్మలు. రాజారావు వుగ్రుడై లేచి నుంచున్నాడు బట్టల స్టేండుమీదున్న బెల్టును చేతిలోకి తీసుకున్నాడు. ఇదంతా గమనిస్తున్న గోపాల్ గుండె దడదడ కొట్టుకుంటోంది. తను చేసిన తప్పేమిటో!

రాజారావు పళ్ళు కొరుకుతూ బెల్టుతో గోపాల్ని నాలుగుసార్లు వాయించాడు. గోపాల్ అర్చాడు, బాధతో ఏడుస్తూ బొబ్బలెట్టాడు

"అమ్మోయ్, నాన్న నన్ను చంపేస్తున్నాడు! చంపేస్తున్నాడు!" అర్చాడు గోపాల్.

నూకాలమ్మ వంటింట్లోంచి పరుగెత్తుకొచ్చింది. గుమ్మంలో నిలబడి లోపలకు చూసింది రాజారావు బెల్టుతో వాయిస్తున్నాడు కొడుకు ఒంటిమీద బెల్టు దెబ్బలు వాతల్లా కనిపిస్తున్నాయి.

"కుర్ర వెధవా! ఇంకా మీసంకూడా రాలేదు యీ పుస్తకం కొని పెట్లో దాచుకుంటావట్రా!" అర్చాడు రాజారావు.

రాజారావు ఒగురుస్తున్నాడు. ఆ క్షణంలో ఆగ్రహం అతడిని పూర్తిగా ఆవహించింది.

"ఆ బుక్కు ఏమిటో నాకు తెలియదు. దాన్ని పెట్లో నేను పెట్టలేదు" అన్నాడు గోపాల్ ఏడుస్తూ.

"చేసిన తప్పును ఒప్పుకోడానికి బదులు అబద్ధం చెప్తావా? నీ చర్మం ఒలిచేస్తానురా, రాస్కెల్!"

నూకాలమ్మ అడ్డుపడింది. బెల్టును ఆమె గట్టిగా పట్టుకుని లాక్కుంది.

"అడ్డు లేవే! ఈ వెధవ పాడైపోతున్నాడు!" అరిచాడతను.

"ఏమైందో నాకు చెప్పండి!" అంది నూకాలమ్మ.

తన చేతిలోవున్న బుక్కును అతను భార్య కిచ్చాడు. బొమ్మల్ని చూసి ఆమె పుస్తకాన్ని మూసింది. తన కొడుకు వంక చూసింది

"ఇది నీ కెలా వచ్చిందిరా?" అడిగిందామె.

"నాకు తెలియదమ్మా! ఆ పుస్తకాన్ని నేను చూడలేదు! ఎవరు పెట్టారో నా పెట్లో!" అన్నాడు గోపాల్ రాగాలు తీస్తూ

"పచ్చి అబద్ధాలు! వాడు పెట్టకుండా ఆ బుక్కు పెట్లోకి ఎలా వస్తుంది? మన యింట్లో పదిమంది లేరు! వాడూ,

చెల్లీ, నువ్వూ, నేనూ తప్ప మరెవ్వరూ లేరుగా!" అరిచాడు రాజారావు.

నూకాలమ్మ కొడుకును బయటకు పొమ్మంది. ఏడుస్తూ గోపాల్ బయటకు పరుగెత్తాడు.

"ఈ వెధవ పాడైపోయాడు వీడికి చదువురాదు!" అరిచాడు రాజారావు.

అతనిలో తుఫానులా చెలరేగిన ఆగ్రహం యింకా తగ్గలేదు. సిగరెట్ వెలిగిస్తున్న అతని చెయ్యి వణుకుతోంది!

ఆమె బెల్టును స్టేండ్‌మీద పడేసింది.

"వాడ్ని ఎడాపెడా వాయించారు. మీరింక శాంతించండి! లేకపోతే మీ ఆరోగ్యం చెడుతుంది ఆ బుక్కు ఎలా వచ్చిందో నేను తర్వాత కనుక్కుంటాను," అందామె.

రాజారావు తన భార్యకేసి చూస్తూ పొగ బయటకు వదిలాడు. ఆయాస పడ్తూ ఆమె చెయ్యి పట్టుకున్నాడు

"ఆ పుస్తకాన్ని ఎక్కడేనా దాచేయి! పిల్లల కంటబడకూడదు," అన్నాడతను.

ఆమె పుస్తకాన్ని పట్టుకని హాల్లోకి నడుస్తూ గుమ్మంలో ఆగి వెనక్కి చూసింది.

"మొహం కడుక్కోండి! కాఫీ తెస్తాను," అందామె నవ్వుతూ.

* * *

నెలలు దొర్లిపోయాయి. గోపాల్ పరీక్ష రాయడానికి వెళ్ళాడు. నూకాలమ్మ తమ్ముడు వీరేశం పల్లెటూరునుంచి అక్క యింటికి క్రితంరోజు వచ్చాడు.

గోపాల్ ట్రంక్ పెట్టెను తెరిచి వీరేశం లోపల దేనికోసమో వెతుకుతున్నాడు.

అదంతా చూస్తున్న నూకాలమ్మ గదిలోకొచ్చి అతనివైపు తిరిగింది.

అతడు పెట్టె మూతను చటుక్కున కిందకు పడేశాడు.

"ఏ మిట్రా వెతుకుతున్నావు?" అడిగిందామె.


"ఏమీలేదు, అక్కయ్యా," అన్నాడతను.

వీరేశం వయస్సు యిరవై రెండేళ్ళు. ఇంకా పెళ్ళికాలేదు. వుద్యోగంలేదు. పల్లెటూర్లో తోచక అప్పుడప్పుడు పట్నానికొచ్చి అక్కయ్య యింట్లో కొన్నిరోజులు వుండి వెళ్ళిపోతూ వుంటాడు.

అతడిని చూస్తూంటే ఆమెలో ఏదో అనుమానం మొలకెత్తింది తను దాచిన పుస్తకంకోసం అతను వెతుకుతున్నాడేమో! అడిగితే వీరేశం తనతో నిజం చెప్పడు! తను నిజాన్ని తెలుసుకోవాలి!

ఆనాటి మధ్యాన్నం వీరేశం పెట్టెను మళ్లా వెతికాడు. అతడికి కావలిసిన పుస్తకం దొరికింది దాన్ని అతను జుబ్బా జేబులో దాచుకుని, పెట్టె మూసి, లేచాడు.

తలుపు వెనకనుంచి అక్కయ్య




అదంతా చూసిందని అతను తెలుసుకో లేదు! ఆ పుస్తకాన్ని పెట్లో ఆమే పడేసిందని అతడికి తెలియదు!

నూకాలమ్మ హాల్లోని సోఫాలో చతికిలబడింది. తన భర్త బెల్టుతో గోపాల్ని కొడుతున్న దృశ్యం ఆమెకు జ్ఞప్తికొచ్చింది. వీరేశం చేసినదానికి తన కొడుకు శిక్షను అనుభవించాడు! ఆమె కళ్ళు నీళ్ళతో నిండాయి!

"ఒరే వీరేశం, నువ్వాపెట్టెలో దాచిన పుస్తకం మూలంగా నీ మేనల్లుడు బెల్టుదెబ్బలు తిన్నాడ్రా!" అరిచిందామె.

వీరేశం తల వంచుకుని మౌనంగా వుండిపోయాడు. "నీకు తొందరగా పెళ్ళి చేసేయమని నాన్నగారికి చెప్తానుండు," అందామె.

రాత్రి గోపాల్, అతని చెల్లెలు భోజనం చేస్తున్నారు ఆమె కొడుకు వైపు ఆప్యాయంగా చూసింది. తప్పు చేయని పిల్లల్ని శిక్షిస్తే వాళ్ళు మానసికంగా గాయపడ్తారు.

"ఒరేయ్ గోపాల్, ఆ పుస్తకాన్ని నువ్వు పెట్లో పెట్టలేదురా!" అందామె.

గోపాల్ సంతోషంగా ఆమెవైపు తిరిగాడు.

"ఎవరు పెట్టారమ్మా?"

"ఎవరయితేనేంలే! నువ్వుకాదు!" అందామె.

"అది నాన్నకు చెప్పమ్మా!" అన్నాడతను.

"తర్వాత చెప్తాలే!" అందామె.

గోపాల్ ఆకలితో మరింత తిన్నాడు. ఆ పుస్తకం ఏమిటో అతనికి తెలియదు, కాని తను తప్పుచేయలేదని తల్లి చెప్పినందుకు అతను చాలా ఆనందించాడు. మర్నాడు పరీక్షకు అతను దిగులులేకుండా వెళ్ళాడు. నిజం ఆఖరికి నెగ్గుతుందనే విశ్వాసం అతనిలో మెల్లిగా నాటుకుంది!